## క్లుప్తంగా

### వినతులపై క్షేత్రస్థాయిలో విచారించండి

**చిత్తూరు అర్బన్:** ప్రజా ఫిర్యాదుల వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం చిత్తూరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఆర్థిక పరమైన అంశాలతో ముడిపడిన పనులపై నివేదిక ఇవ్వాలని, మిగిలిన వాటిని సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా. లోకేష్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

### వినాయకుడి సేవలో ఉత్తరప్రదేశ్ మంత్రి



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

**కాణిపాకం:** కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కపిల్‌దేవ్ అగర్వాల్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వీరికి ఈఓ పెంచల కిషోర్ స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచనాలు, ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఫ్యామిలీ డాక్టర్ సేవలు



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కరారి కుమార్

**గుడిపాల:** గ్రామీణ ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని తిమ్మయ్యపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



గాయపడిన రఘునాథరెడ్డి, పవనకుమారి

**బంగారుపాళెం:** మండలంలోని కేజీసత్రం వద్ద సోమవారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తవణంపల్లె మండలం సరకల్లు గామానికి చెందిన రఘునాథరెడ్డి, భార్య పవనకుమారి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై బంగారుపాళెం మండలం కల్లూరుపల్లెలో గల బంధువుల ఇంటికి వస్తుండగా.. కేజీ సత్రం వద్ద జాతీయ రహదారిలోని మలుపు సమీపంలో రోడ్డును దాటుకునేందుకు యత్నించాడు. ఈ క్రమంలో పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కంటైనర్ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### సాయుధ దళాలకు వీడ్కోలు

**చిత్తూరు అర్బన్:** చిత్తూరులోని కాణిపాకం బైపాస్ రోడ్డులో సోమవారం ట్రై నేషన్, ట్రై సర్వీసెస్ లార్డ్ బుద్ధ మోటార్ సైకిల్ యాత్రను అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఏడు రాష్ట్రాలు దాటి మోటార్ సైకిల్ పై వెళ్తున్న సాయుధ దళాలకు ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

### 13న జాతీయ లోక్ అదాలత్

**పుంగనూరు:** పుంగనూరు కోర్టు ఆవరణలో ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్‌జడ్జి ఆరీఫా షేక్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, అన్నిశాఖల అధికారులు తమ పరిధిలోని కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు కృషి చేసి, ప్రజల మధ్య శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఐలు కేవీ.రమణ, రమేష్‌బాబు, శివశంకర్, నాగేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

# సర్కారు వారి స్మార్ట్ దోపిడీ

- నూతన సర్వీసులపై బాదుడుకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం
- రెండింతలు పెరిగిన సర్వీసు రేట్లు
- మరోవైపు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు
- జనం నుంచి వ్యక్తం అవుతున్న తీవ్ర ఆగ్రహావేశాలు



నగరానికి చెందిన నాగరాజు వారం ముందు ఇంటి స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఇంటి పనుల ప్రారంభ నిమిత్తం నూతన సర్వీసుకు దరఖాస్తు చేసుకోవడానికి మీ–సేవాకు వెళ్లాడు. రెండు కిలోవాట్ల సామర్థ్యంతో మీటర్ దరఖాస్తు చేయగా రూ.6,800 కట్టాలని నిర్వాహకులు చెప్పారు. దీంతో షాక్‌కు గురవడం అతని వంతు అయింది. అదేమిటి ఆ సామర్థ్యానికి రూ.3,750 కదా అని అడగ్గా ఇప్పుడు ధరలు పెరిగిందని వారు చెప్పడంతో ఆ మొత్తం చెల్లించి వెనుదిరిగాడు. ఇది ఒక నాగరాజు బాధే కాదు ఇక మీదట నూతన సర్వీసు కావాల్సిన వారి పరిస్థితి.

**చిత్తూరు కార్పొరేషన్:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు.. అధికారంలో వచ్చాక కూటమి ప్రభుత్వం చేపడుతున్న పనులకు పొంతన లేకుండా పోతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఊరువాడా తిరిగి కూటమి ప్రభుత్వం పాలన పగ్గాలు చేపడితే విద్యుత్ చార్జీలు పెంచం.. అవసరమైతే తగ్గిస్తామని చంద్రబాబునాయుడు హామీలిచ్చారు. తీరా అధికారంలో వచ్చాక మాట మీద నిలబడే రకం కాదని మరోసారి నిరూపించుకున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నూతన సర్వీసుల ధరలను అమాంతం రెండింతలు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. స్మార్ట్‌మీటర్లను గతంలో వ్యతిరేకించి ప్రస్తుతం వాటి బిగిస్తున్నారు. ఏడాది కాలంగా గతంలో వాడుకున్న బిల్లుకు సర్దుబాటు చార్జీ పేరిట ప్రతి నెల ట్రూఅప్ భారం అదనంగా పడుతున్న విషయం తెలిసిందే.

**రెండింతలు పెరిగిన ధరలు..**

నూతన విద్యుత్ సర్వీసు తీసుకోవాలంటే చుక్కలు కనబడుతున్నాయి. గతంలో ఉన్న దాని కంటే రెండింతల వరకు ధరలు పెంచారు. కొత్తగా విద్యుత్ సర్వీసు కావాలంటే గృహ వినియోగదారులు ఒక కిలోవాట్‌కు అన్ని రకాల చార్జీలు కలిపి గతంలో రూ.1,850 ఉండగా ప్రస్తుతం రూ.3,800 వరకు పెంచారు. 2 కిలోవాట్స్‌కు ముందు రూ.3,750 ఉండగా రూ.6,800 వరకు చేశారు. కమర్షియల్ సర్వీసు ఒక కిలోవాట్‌కు రూ.2,250 ఉంటే రూ.4,300 వరకు పెంచగా, 2 కిలోవాట్‌కు రూ.4,500 ఉండగా రూ.8,400 చేశారు. ప్రస్తుతం నూతన సర్వీసు ఇవ్వాలంటే దాదాపు 2 కిలోవాట్స్ సామర్థ్యంతో ఇస్తున్నారు. మీటర్‌బోర్డు, సర్వీసు వైరుతో కలిపి ఇస్తుండడంతో ధరలు పెరిగిందని అధికారులు సమర్థిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎలక్ట్రికల్ దుకాణాల్లో వాటిని కొనుగోలు చేసిన సగం ధర కూడా అవదు.

**స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో పీకులాట..**

స్మార్ట్‌మీటర్ల విధానంపై గొప్పలు చెప్పుకుంటున్నా.. అందులో ఉన్న లొసుగులు తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. వీటిని ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సర్వీసులకు బిగిస్తుండగా త్వరలో గృహ సర్వీసులకు పెట్టనున్నారు. తర్వాత వాటిని ప్రీపెయిడ్ మీటర్‌గా మార్చనున్నారు. ఈ మీటర్ ఏర్పాటు చేస్తే పూటకో టారిఫ్ విధించనున్నారు. అంతే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక టారిఫ్, మధ్యాహ్నం నుంచి సాయంత్రం మరొకటి, సాయంత్రం నుంచి ఇంకో టారిఫ్‌తో బిల్లులు మోతమోగుతున్నాయి. వీటిని మొబైల్ రీచార్జ్ మాదిరి ముందుగానే డబ్బులు వేసుకోవాలి. మీటర్‌లో డబ్బులు అయిపోతే అర్ధరాత్రిలో కరెంటు పోయినా రీచార్జ్ చేసుకుంటే కానీ విద్యుత్ రాదు. ఆ సమయంలో సర్వర్ పని చేయకపోయినా, ఇతర సమస్యలు ఉన్న దోమలతో సహవాసం చేయాలి.

### అధినేతను కలిసిన సునీల్



మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు కేక్ తినిపిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

**కాణిపాకం:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సోమవారం పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఆయన నియోజకవర్గ పరిస్థితిపై చర్చించారు. అనంతరం సునీల్‌కుమార్‌కు జన్మదినం కావడంతో జగన్‌మోహన్‌రెడ్డి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

### సన్మానం

**చిత్తూరు అర్బన్:** జిల్లా పోలీసుశాఖలో ఏఎస్‌ఐగా పదవీ విరమణ చేసిన మునుస్వామిని సోమవారం చిత్తూరు ఎస్పీ మణికంఠ ఘనంగా సన్మానించారు. చిత్తూరు నగరంలోని పోలీసు అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అధికారులతో కలిసి మునుస్వామిని సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ రిటైర్డు అయ్యారు.

### భారీ ధర పలికిన లడ్డు



గణపతి లడ్డూను రూ.81 వేలకు దక్కించుకున్న మణికంఠ

**బంగారుపాళెం:** మండలంలోని పెరుమాళ్లపల్లెలో సోమవారం సాయంత్రం గణపతి లడ్డూ వేలం వేశారు. చవితి నాడు స్వామివారికి 10 కేజీలు, 7 కేజీలు, 5 కేజీల లడ్డూ ప్రసాదాలను సమర్పించారు. 10 కేజీల లడ్డూను వేలం వేయగా రూ.81 వేలకు గ్రామానికి చెందిన మణికంఠ, అలాగే 7 కేజీల లడ్డూను రూ.45 వేలకు శ్రీను, దివాకర్, 5 కేజీల లడ్డూను అదే గ్రామానికి చెందిన నితిన్ రూ.16,500 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు వైఎస్సార్ వర్ధంతి

**చిత్తూరు కార్పొరేషన్:** నగరంలో మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు డీసీసీ బ్యాంకు వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించనున్నారు. అనంతరం సంతపేటలో మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు. ఈ కార్యక్రమాలకు ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని నాయకులు వివరించారు.

**ఐరాలలో..**

**ఐరాల:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 16వ వర్ధంతిని మంగళవారం మండల వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుండ్లపల్లె గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉదయం 8.30 గంటలకు వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి, ఉదయం 10.45 గంటలకు స్థానిక వారపు సంత వద్ద అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు గోవిందరెడ్డిపల్లె గ్రామస్తుల ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్ర హం వద్ద నివాళి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలకు పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అభిమాను లు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

**బంగారుపాళెంలో.**

**బంగారుపాళెం:** మండల కేంద్రంలో మహానేత వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కరిడివారిపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీపీ, జెడ్పీ టీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

# అట్టహాసంగా గణేశుడి నిమజ్జనం



దిగువ కామినాయనపల్లెలో గణేశుడిని నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామస్తులు

**ఐరాల:** మండలంలోని దిగువ కామినాయనపల్లెలో గణేశుడి నిమజ్జనం సోమవారం కోలాహలంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించి ఆరు రోజు నిమజ్జనానికి తరలించారు. మండపం వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విశేష పూజలందుకున్న గణేశుడిని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. డ్రమ్స్, వాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ యువత, మహిళలు, చిన్నారులు చిందులు వేశారు. జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటూ నినదించారు. అనంతరం గ్రామం సమీపంలోని చెరువులో ప్రతిమను నిమజ్జనం చేశారు.

# అంటువ్యాధుల నియంత్రణపై అవగాహన



వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రెడ్డెప్ప

**ఐరాల:** వర్షాకాలంలో అంటువ్యాధుల వ్యాప్తి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. సోమవారం మండలంలోని 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 143 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న తరుణంలో అంటు వ్యాధులు ప్రబలే అవకావం ఉందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు నీరు, చెత్తాచెదారాలు ఉంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డయేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. అంటువ్యాధుల బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# పారదర్శకతకే స్మార్ట్ రేషన్‌కార్డులు



మహిళకు స్మార్ట్‌కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

**ఐరాల:** క్యూఆర్ కోడ్ ఆధారిత రేషన్‌కార్డులతో ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత కోసమే స్మార్ట్‌కార్డులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వీఎస్ అగ్రహారంలో స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు, వృద్ధులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ‘వ్యర్థ’ నిర్లక్ష్యం



వ్యర్థాలు, నీటిలో కలుషితమైన దృశ్యం

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తుండడంతో.. అవి వర్షపు నీటిలో కలిసి కలుషితం అవుతున్నాయి. చిత్తూరు మండలం కమ్మపల్లి ప్రాంతంలోని ఓ ఫ్యాక్టరీ వ్యర్థాలను తీసుకొచ్చి ప్రభుత్వ భూములు, రోడ్డు పక్కన తోలేస్తున్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాలను ముత్తుకూరు సమీపంలోని ఓ ప్రభుత్వ భూమిలో పడేసి వెళ్లిపోతున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతూ గుప్పుమంటోంది. అర కిలోమీటర మేర దుర్వాసన విస్తరిస్తోంది. అక్కడ పడేసిన వ్యర్థాలు వర్షం వస్తే.. పక్కనే ఉండే కాలువ ద్వారా ప్రవహిస్తూ చెరువులో కలిసి పోతున్నాయి. పంచాయతీస్థాయి అధికారులు ఇది తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**తవణంపల్లె:** గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ చిరంజీవి కథనం.. కాణిపాకం–చిత్తూరు రోడ్డులో ఆదివారం రాత్రి సీఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలో చిత్తూరు నగరం, మురుగానపల్లెలో కామేశ్వర్ నగర్‌కు చెందిన ఎజిల్‌అరసన్(45) ద్విచక్ర వాహనంలో చిత్తూరుకు వెళ్తున్నాడు. అదేసమయంలో ఓ గుర్తుతెలియని వాహనం అతన్ని బలంగా ఢీకొట్టింది. రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న మరో వ్యక్తిని సైతం ఢీకొట్టింది. క్షతగాత్రులను 108 సిబ్బంది మొదట చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎజిల్‌అరసన్ పరిస్థితి విషమించడంతో రాణిపేట సీఎంసీకి తరలించారు. అక్కడి నుంచి వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య పూజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గాయపడిన మరో వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సరస్వతీ.. క్షమించు తల్లీ..



పాఠశాల ప్రాంగణంలో మందుబాబులు సేవించిన బాటిళ్లను శుభ్రం చేస్తున్న విద్యార్థి



కాజూరు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పడి ఉన్న మందు బాటిళ్లు

సరస్వతీ దేవి కొలువై ఉండే దేవాలయం లాంటి విద్యాలయంలో మందుబాబులు పాడు పనులకు పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని కాజూరు ప్రాథమిక పాఠశాలలో మందుబాబులు కొందరు ఆకతాయిలు విచ్చలవిడిగా మద్యం స్వీకరించి ఖాళీ బాటిళ్లను ఇష్టానుసారం ఎక్కడ పడితే అక్కడ పడేసి వెళ్లారు. సోమవారం ఉదయం యథాతథంగా పాఠశాలకు విచ్చేసిన టీచర్ ప్రాంగణం మొత్తం ఖాళీ మద్యం పడి ఉండడం చూసి నివ్వెరపోయారు. స్కూల్‌లో చదివే విద్యార్థులే వాటిని శుభ్రం చేసుకున్నారు. ఈ సన్నివేశాలు సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేశాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కారు పాఠశాలలను నాడు నేడు పథకంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు మందుబాబులకు నిలయాలుగా మారాయి. గత ప్రభుత్వంలో పాఠశాలల్లో వాచ్‌మెన్‌లను నియమించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాచ్‌మెన్‌లను నియమించకపోవడంతో భద్రత లేకుండా పోయింది. అయితే ఈ ఘటన పట్ల విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు మిన్నకుండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– చిత్తూరు కలెక్టరేట్





నృత్యామృతం

**కాణిపాకం:** కాణిపాకం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థానంలో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు కూచిపూడి నాట్యం చేస్తుంటే ఆహుతులు మంత్రముగ్ధులయ్యారు. భరతనాట్యంతో భళా అనిపించారు. వారి ముఖంలో పలికించిన హావభావాలు అమోఘం. హరికథ కాలక్షేపం, భక్తిగీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోలాట భజనలతో ఆస్థాన మండపం వేదిక దద్దరిల్లింది.

### అధునాతన హంగులతో ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్



తుదిదశకు చేరిన కాంప్లెక్స్

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో అధునాతన హంగులతో జిల్లా ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్ భవనం నిర్మిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న ఈ భవన పనులు తాజాగా తుది దశకు చేరుకున్నాయి. వేగవంతంగా ఆ భవన పనులను పూర్తి చేసి ప్రారంభించేందుకు జిల్లా ఖజానా శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ భవనం ప్రారంభం కాగానే జిల్లా ఖజాన శాఖ పరిధిలోని అన్ని శాఖలు ఈ భవనంలోకి మార్పు కానున్నాయి.

### పెన్షన్ భిక్ష కాదు హక్కు



కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న టీచర్లు

**ఐరాల:** ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదు, ఉద్యోగి హక్కు అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు స్పష్టం చేశారు. సోమవారం కాణిపాకం జెడ్పీ హైస్కూల్, ప్లస్‌లో సీపీఎస్ ఉద్యోగుల జీవితాల్లో చీకటి రోజైన సెప్టెంబర్ 1వ తేదీ విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో అన్ని సంఘాల మద్దతు నిర్వహిస్తున్న పెన్షన్ మార్చ్ నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సీపీఎస్ అమల్లోకి వచ్చిందని, ఈ సీపీఎస్ రద్దు కోసం అనేక పోరాటాలు చేశామని తెలిపారు. అందులో భాగంగా విజయవాడలో ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన నిరసనకు మద్దతుగా నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైనట్లు వెల్లడించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపీనాథరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

**చిత్తూరు కార్పొరేషన్:** పంచాయతీరాజ్ ఎస్‌ఈగా చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈగా నవీన్‌కుమార్ సోమవా రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈఈగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. ఆయనకు పదోన్నతి ఇచ్చి జిల్లా ఎస్‌ఈగా కొనసాగించారు. ఈఈ స్థానం ఖాళీ కావడంతో అనంతపురం ఈఈగా ఉన్న నవీన్‌కుమార్‌ను పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. తొలుత వీరు మర్యాద పూర్వకంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు.